సాక్షి
నిజామాబాద్
ఆదివారం । 13 । జూలై । 2025



వర్షంలో డ్రైవింగ్ జాగ్రత్త!

వర్షాకాలంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా అవుతుంటాయి. వాహనాలు అదుపుతప్పి పలువురు మృతి చెందిన ఘటనలున్నాయి.

- 8లో ▸



53 ఏళ్ల తర్వాత..

జిల్లా కేంద్రంలోని మానిక్ భవన్ పాఠశాలలో (1972–73 బ్యాచ్) పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవాలను ఘనంగా నిర్వహించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.5 /23.0

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

నవజాత శిశువు అమ్మకం

- నలుగురు అరెస్ట్

ఖలీల్‌వాడి: నగరంలోని మిర్చి కంపౌండ్‌లో నవజాతశిశువును అమ్మిన నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి శనివారం తెలిపారు. ఎస్‌హెచ్‌వో తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని మిర్చికంపౌండ్‌కు చెందిన ముత్యాలమ్మ వెంకట్రావు, లక్ష్మి దంపతులు. వీరు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. కాగా వీరికి ఐదో సంతానంగా మరో ఆడపిల్ల జన్మించింది. దీంతో కుటుంబ పోషణ, ఆర్థి క ఇబ్బందులతో ఆ దంపతులు అదే ప్రాంతానికి చెందిన ఉమారాణిని నవజాత శిశువు విక్రయానికి సంప్రదించారు. దీంతో ఆమె మహారాష్ట్రలోని సోలాపూర్‌కు చెందిన నాగమణి ద్వారా అక్కడే ఉండే ఓ వ్యక్తికి ఈ శిశువును రూ. రెండు లక్షలకు అమ్మేశారు. ఈ విషయం సీడీపీవో సౌందర్యకు ఈ నెల 11వ తేదీన తెలియడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే కేసు నమోదు చేసి ఓ పోలీసు బృందాన్ని సోలాపూర్‌కు పంపినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. ఈ ఘటనలో దంపతులతో పాటు విక్రయానికి సహకరించిన ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఏజెన్సీలను రద్దు చేయాలి



నిజామాబాద్‌నాగారం: అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలను రద్దు చేసి ఉద్యోగులకు ప్రభుత్వమే నేరుగా జీతాలు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ, తెలంగాణ వెల్‌నెస్ సెంటర్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజశేఖర్ కోరారు. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద మహాధర్నా నిర్వహించగా, శనివారం జిల్లా కేంద్రంలోని వెల్‌నెస్ సెంటర్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తెలంగాణ వెల్‌నెస్ సెంటర్స్ ఉద్యోగులు మహాధర్నాలో అనివార్య కారణాల వల్ల పాల్గొనలేక పోయామన్నారు. అవుట్‌సోర్సింగ్ వ్యవస్థను రద్దుచేసి ప్రభుత్వమే నేరుగా జీతాలు చెల్లించాలని, లేనిపక్షంలో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. రెగ్యులర్ చేయడంతో పాటు ఉద్యోగ, ఆరోగ్య భద్రతను కల్పించాలని, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. నిరసనలో డాక్టర్లు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఖిల్లా వద్ద ముస్తాబైన గ్రామ దేవతల గద్దె

నేడు ఊరంతా పండుగ



సర్వసమాజ్ ఆధ్వర్యంలో నిర్వహణకు ఏర్పాట్లు

- కులాలకు అతీతంగా ఏకమై అమ్మవార్లను కొలవనున్న నగరవాసులు
- మామిడి కర్రలతో విగ్రహాలు సిద్ధం
- శారదాంబ గద్దె నుంచి ఊరేగింపు
- పండుగలో పాల్గొననున్న కుల సంఘాలు

సండే స్పెషల్

నిజామాబాద్ రూరల్: పిల్లాపాప, పాడి పంట, గొడ్డు గోద సల్లంగా ఉండాలని, ప్లేగు మహమ్మారి నుంచి తమను కాపాడాలని గ్రామ దేవతలను కొలుస్తూ ఇందూరు నగరవాసులు సుమారు 77 ఏళ్ల క్రితం ప్రారంభించిన ఊరపండగ నేటికీ ఆనవాయితీగా వస్తోంది. ఊరందరికీ ఇదే 'పెద్ద పండగ' కావడం విశేషం. ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది కూడా ఊర పండగను ఘనంగా నిర్వహించేందుకు సర్వసమాజ్ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఊర పండగ ఊరేగింపులో నగరవాసులు భారీ సంఖ్యలో పాల్గొని అడుగడుగునా అమ్మవార్ల ఆశీర్వాదం కోసం పూజిస్తారు. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా బండారు పోసిన తరువాత నగరంలోని నకాశ్‌గల్లీలో మామిడికర్రలతో గ్రామ దేవతల విగ్రహాలను సిద్ధం చేశారు. విగ్రహాల ఊరేగింపులో 54 కుల సంఘాలు పాల్గొననున్నాయి.

భారీ ఊరేగింపు

ఖిల్లా శారదాంబ గద్దె నుంచి ప్రారంభం కానున్న గ్రామదేవతల ఊరేగింపు పెద్దబజార్ చౌరస్తా వద్ద దుబ్బ, వినాయక్‌నగర్, సిర్నాపల్లి గడి దిశగా విడిపోతుంది. గాజుల్‌పేటలోని వివేకానంద చౌరస్తా వద్ద భారీ పోలీసు బందోబస్తు మధ్య సరి (ఇంటిపై చల్లుకునే పదార్థం) కోసం నగరవాసులు పోటీపడుతారు.

తమను సల్లంగా కాపాడాలని అమ్మవార్లను మనసారా కొలుస్తూ ఊరంతా కలిసి జరుపుకునే ఊరపండుగకు ఇందూరు నగరం సిద్ధమైంది. ఖిల్లా ప్రాంతంలో ఉన్న శారదాంబ గద్దె నుంచి అమ్మవార్లకు తోడుగా కొండలరాయుడు, బోగస్వామి తరలిరానున్నారు. నగరంలోని 12 చోట్ల ఉన్న ఆలయాల్లో మొత్తం 14 గ్రామదేవతలు కొలువుదీరనున్నారు. ఇందుకోసం సర్వసమాజ్ ఏర్పాట్లు చేయగా, మామిడి కర్రలతో సిద్ధమైన నూతన విగ్రహాలు శనివారం అర్ధరాత్రి గద్దెకు చేరుకున్నాయి. ప్రత్యేక పూజలు, భక్తులకు దర్శనం అనంతరం ఆదివారం తెల్లవారిన తరువాత ఊరేగింపు ప్రారంభమవుతుంది.

పోలీసులకు సహకరించాలి



పండుగ ఏర్పాట్లపై చర్చిస్తున్న సీపీ చైతన్య

ఖలీల్‌వాడి: ఊర పండుగ శోభాయాత్ర రూట్‌ను సీపీ సాయిచైతన్య శనివారం రాత్రి పరిశీలించారు. రఘునాథ ఆలయం, ఖిల్లా చౌరస్తా నుంచి ప్రారంభమై వివేకానంద చౌరస్తా, లక్ష్మి మెడికల్, గాజుల్‌పేట్, పెద్దబజార్, గోల్‌హనుమాన్, పులాంగ్ చౌరస్తా, వినాయక నగర్ ఆర్యనగర్, దుబ్బ తదితర ప్రాంతాల్లో ఏర్పాట్లను పర్యవేక్షించారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. సీపీ వెంట ఎస్బీ సీఐ శ్రీశైలం, నగర సీఐ శ్రీనివాసరాజ్, పెద్దలు రామ్మూర్తి గంగారాం, గాండ్ల లింగం, రాజేందర్ ధూంపేట తదితరులున్నారు.

12 ప్రాంతాల్లో.. 14 గ్రామ దేవతలు

నగరంలోని మూడు ప్రాంతాల పరిధిలో 12 గుడులు ఉండగా 14 మంది గ్రామ దేవతలు కొలువుదీరనున్నారు. దుబ్బ ప్రాంతంతో రాట్నం, చక్రం, పెద్దమ్మ, పొడాలమ్మ, వినాయక్‌నగర్‌లో మహాలక్ష్మి, ఐదు చేతుల పోచమ్మ, మత్తడి పోచమ్మ, సిర్నాపల్లి గడీ రోడ్డులో కొండల రాయుడు, బోగస్వామి, సమ్మక్క, సరక్కలు గద్దెలపై కొలువుదీరుతారు.



సిద్ధమైన గ్రామ దేవతల విగ్రహాల వద్ద సర్వసమాజ్ కమిటీ పెద్దలు

కుల సంఘాల భాగస్వామ్యం



ఇందూరు నగరంలో 78 ఏళ్లుగా ప్రతి ఏటా ఊర పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. 54 కుల సంఘాలు పాల్గొంటుండగా మరిన్ని సంఘాలను భాగస్వామ్యం చేస్తూ ముందుకు వెళ్తున్నాం. ప్రస్తుతం 90 కుల సంఘాలు ఉన్నాయి. పండుగకు, ఊరేగింపునకు మరింత శోభ పెరుగుతూ వస్తోంది. అలాగే నగర ప్రజల్లో ఐకమత్యం పెరుగుతోంది. రాజకీయాలకతీతంగా పండగను విజయవంతంగా నిర్వహిస్తున్నాం.

– యెండల లక్ష్మీనారాయణ, సర్వసమాజ్ కమిటీ అధ్యక్షుడు

కలిసికట్టుగా పాల్గొంటారు



నగరంలో సుమారు ఎనిమిది దశాబ్దాలుగా నిర్వహిస్తున్న ఊర పండుగలో నగరవాసులు కలిసికట్టుగా పాల్గొంటారు. ఏడాదికేడాది పండగలో పాల్గొనే వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. నగరం విస్తరిస్తుండడంతో ప్రతి ప్రాంతంలో ఊరపండగు ఆనవాయితీని కొనసాగిస్తున్నారు.

– బంటు రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి, సర్వసమాజ్ కమిటీ

మహిళలతో బోనాలు



ఊర పండగలో భాగంగా శనిఆరం రాత్రి మహిళలు బోనాలు తీస్తారు. తరాలు మారినప్పటికీ పండగ ఆనవాయితీలో మార్పు లేదు. అదే ఆనవాయితీని కొనసాగిస్తున్నాం. సరి(పత్యేక పదార్థం) సంబంధించిన వస్తువులను నగరంలోని ప్రతి ప్రాంతానికి శనివారం పంపిణీ చేశాం.

– ఆదె ప్రవీణ్‌కుమార్, కో కన్వీనర్, సర్వసమాజ్ కమిటీ



మేకల సంతలో కొనుగోలుదారుల సందడి

కిక్కిరిసిన మేకల సంత

- రూ. 3 కోట్లకు పైగా లావాదేవీలు
- ఊర పండుగ, వనభోజనాల ప్రభావం

నవీపేట: మండల కేంద్రంలో శనివారం మేకల సంత వ్యాపారులు, వినియోగదారులతో కిక్కిరిసింది. నిజామాబాద్‌నగరంతోపాటు గ్రామాల్లోద ఊరపండగు, వనభోజనాలు నిర్వహిస్తుండడంతో సంత ప్రాంగణం సందడిగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి కొనుగోలదారులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. జీవాల ధరలను వ్యాపారులు అమాంతం పెంచేశారు. ఒక్కో మేకను రూ. 7 వేల నుంచి రూ. 10 వేలకు విక్రయించారు. అలాగే పొట్టేలును (మేక పోతు) రూ. 12 వేల నుంచి రూ. 15 వేలకు విక్రయించారు. ధరలను లెక్క చేయకుండా వినియోగదారులు పోటాపోటీగా కొనుగోలు చేశారు. ఒక్క రోజే రూ.3 కోట్ల నుంచి రూ. 4 కోట్ల మేర లావాదేవీలు జరిగినట్లు వ్యాపారులు పేర్కొన్నారు.

పీజీ ప్రవేశాలకు సీపీగెట్

- దరఖాస్తుకు ఐదు రోజులే గడువు
- తెయూలో 820 సీట్లు



సీపీగెట్ దరఖాస్తుకు తుది గడువు (ఫైన్ లేకుండా) 17.07.2025
మార్పులు, చేర్పులకు 17.07.2025 నుంచి 20.07.2025 వరకు
రూ.500 అపరాధ రుసుముతో 24.07.2025 వరకు
రూ.2000 అపరాధ రుసుముతో 28.07.2025 వరకు
www.cpget.tsche.ac.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు

తెయూ(డిచ్‌పల్లి): డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులు ఉన్నత విద్యలో భాగంగా పీజీ కోర్సులు చదివేందుకు ఉన్నత విద్యామండలి ఉమ్మడి పీజీ ప్రవేశ పరీక్ష(సీపీగెట్) నిర్వహిస్తోంది. అందులో భాగంగా జూన్ 18 నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం కాగా, అపరాధ రుసుము లేకుండా ఈ నెల 17 వరకు తుది గడువుగా ప్రకటించారు. ఆగస్టు మొదటి వారం నుంచి ఆన్‌లైన్‌లో ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నారు. ర్యాంకు ఆధారంగా రాష్ట్రంలోని ఎనిమిది యూనివర్సిటీల్లో (ఉస్మానియా, తెలంగాణ, కాకతీయ, మహాత్మాగాంధీ, పాలమూరు, శాతవాహన, జేఎన్‌టీయూహెచ్, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ) ప్రవేశాలు పొందవచ్చు.

తెలంగాణ యూనివర్సిటీలో..

జిల్లాలోని తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో డిచ్‌పల్లి మెయిన్ క్యాంపస్, కామారెడ్డి జిల్లా భిక్కనూర్‌లోని సౌత్ క్యాంపస్‌లో మొత్తం 26 కోర్సులలో 820 అందుబాటులో ఉన్నాయి. ఇందులో రెండేళ్ల పీజీ కోర్సులతోపాటు ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులున్నాయి. మెయిన్ క్యాంపస్‌లో ఎంఏ (తెలుగు, హిందీ, ఇంగ్లిష్, ఉర్దూ, ఎకనామిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, మాస్ కమ్యూనికేషన్), ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ అప్లయిడ్ ఎకనామిక్స్, ఇంటిగ్రేటెడ్ ఐఎంబీఏ, ఎం.కామ్(ఈ–కామర్స్), ఎంఎస్సీ మ్యాథ్స్, బోటని, కెమిస్ట్రీ (స్పెషలైజేషన్ ఆర్గానిక్ కెమిస్ట్రీ), కెమిస్ట్రీ (స్పెషలైజేషన్ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ), ఇంటిగ్రేటెడ్ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ, అప్లయిడ్ స్టాటిస్టిక్స్, బయోటెక్నాలజీ పీజీ కోర్సులున్నాయి. భిక్కనూరు సౌత్ క్యాంపస్‌లో ఎంఏ (హిస్టరీ, తెలుగు (కంపారిటివ్ లిటరేచర్), పొలిటికల్ సైన్స్, ఎంఎస్‌డబ్ల్యూ (సోషల్ వర్క్), ఎంఎస్సీ కెమిస్ట్రీ (స్పెషలైజేషన్ ఆర్గానిక్ కెమిస్ట్రీ), ఫిజిక్స్(స్పెషలైజేషన్ ఎలక్ట్రానిక్స్), జియో ఇన్ఫర్మెటిక్స్, జువాలజీ కోర్సులున్నాయి.

రాష్ట్రస్థాయి చెస్‌కు ఎంపిక

నిజామాబాద్‌నాగారం: జిల్లాస్థాయి అండర్ – 13 చెస్ టోర్నీని(బాలబాలికలు) జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని అభ్యాస స్కూల్‌లో శనివారం నిర్వహించారు. ఉత్తమ ప్రతిభకనబర్చిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నవీపేట్ ఎంఈవో అశోక్ హాజరై విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. విజేతలుగా నిలిచిన త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి రమేశ్, లక్ష్మణ్, ఆర్బిటర్ వైభవ్, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు,.



విజేతలు వీరే..

బాలుర విభాగం : టి శివానంద్(కేవీఎస్), టి సాయిరుద్ర(విశ్వోదయ)

బాలికల విభాగం : కె నాగ జోష్నిక, సహస్ర(ప్రెసిడెన్సీ).

విజయాల బడి

- ప్రయివేట్‌ను తలదన్నేలా డిజిటల్ పాఠాలు
- సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లతో మెదడుకు పదును
- 14 ఏళ్లుగా పదోతరగతిలో వందశాతం ఫలితాలు
- ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధిస్తున్న విద్యార్థులు
- పీఎంశ్రీ ప్రభుత్వ పాఠశాలలో విభిన్న రీతిలో విద్యాబోధన
- రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తున్న సర్కార్ బడి

డొంకేశ్వర్ స్కూల్ విజయఢంకా



పాఠశాలలో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

డొంకేశ్వర్(ఆర్మూర్): డిజిటల్ పాఠాలు, సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లతో మెరికల్లాంటి విద్యార్థులను సమాజానికి అందిస్తోంది డొంకేశ్వర్‌లోని పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల. 14 ఏళ్లుగా విజయ ఢంకా మోగిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న ఈ పాఠశాల ఎంతో మంది ప్రభుత్వ ఉద్యోగులను అందించింది. ఇక్కడ చదివిన వారెంతో మంది ఆర్మీ, పోలీసు, అటవీ, పంచాయతీరాజ్, రెవెన్యూ, ఎలక్ట్రిసిటీ, టీచర్లుగా సేవలందిస్తున్నారు.

బడి కోసం..

ఎక్కడ పని చేసి వచ్చిన వారైనా సరే డొంకేశ్వర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలోకి అడుగు పెడితే ఇక్కడి వాతావరణానికి అనుగుణంగా మారిపోవాల్సిందే. రెండెకరాల విస్తీర్ణంలో ఆహ్లాదకర వాతావరణంలో ఉండే పాఠశాల ప్రయివేట్ బడులను తలదన్నేలా కొనసాగుతోంది. 1979లో పాఠశాల ఏర్పాటు కాగా చాలాకాలం పాటు ఏడో తరగతి వరకు మాత్రమే కొనసాగింది. 1994–95లో పదో తరగతికి అప్‌గ్రేడ్ కావడంతో విశాలమైన తరగతి గదులను నిర్మించారు. సౌకర్యాలు మెరుగయ్యేందుకు గ్రామస్తులు ఎప్పటికప్పుడు ఆర్థిక సహకారం అందిస్తూ వచ్చారు. ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. ఇక్కడ చదివే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలని కృషి చేస్తున్నారు. ప్రయివేటును తలదన్నేలా వినూత్న పద్ధతుల్లో డిజిటల్ పాఠాలు బోధిస్తున్నారు.



డొంకేశ్వర్ పీఎంశ్రీ జెడ్పీ ఉన్నత పాఠశాల



పాఠశాలలో మినరల్ వాటర్

ఉపాధ్యాయుల కృషి

క్రమశిక్షణకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్న ఉపాధ్యాయులు.. చదువులో రాణించేలా విద్యార్థులను ఆరో తరగతి నుంచే సన్నద్ధం చేస్తున్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషలపై విద్యార్థులు పట్టుసాధించేలా కృషి చేస్తున్నారు. అలాగే డిజిటల్ బోర్డులపై బోధన, గణితం సులభంగా అర్థమయ్యేలా ప్రాక్టికల్స్ చేయిస్తున్నారు. సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లలో ఎక్కువ సమయాన్ని కేటాయిస్తూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను బయటకు తీస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపులూ ఎప్పటికప్పుడు వారి సందేహాలను నివృత్తి చేస్తూ పరీక్షలంటే భయం లేకుండా ప్రేరణ కలిగిస్తున్నారు. విద్యార్థులకు కనీసం రెండు ఇతర రాష్ట్రాల భాషలు వచ్చి ఉండాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇక్కడి విద్యార్థులకు హర్యానా భాష, సంస్కృతులను నేర్పుతున్నారు. ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం రుచిగా ఉండేలా పర్యవేక్షణ చేయడమే కాకుండా టీచర్లు, గ్రామస్తులు సొంత ఖర్చులతో శుద్ధి చేసిన మినరల్ వాటర్‌ను అందిస్తున్నారు.



డిజిటల్ బోర్డుపై బోధిస్తున్న ఉపాధ్యాయుడు

ఈ ఏడాది ట్రిపుల్ ఐటీకి 27 మంది..

డొంకేశ్వర్ పాఠశాల నుంచి ఈ ఏడాది ప్రతిష్మాతక ట్రిపుల్ ఐటీకి 27 మంది విద్యార్థులు ఎంపిక కావడం రాష్ట్రంలోనే రికార్డు. మొత్తం 74 మంది విద్యార్థులు ఎస్సెస్సీ పరీక్షలు రాయగా 66 మంది 500కుపైగా మార్కులు సాధించారు. మిగతా 8 మంది విద్యార్థులు 480 నుంచి 499 మధ్య మార్కులు సాధించారు. ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది కూడా వందశాతం ఉత్తీర్ణత నమోదైంది. తోట రక్షిత (586), డి. వైశాలి (582) మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు.

విమానం ఎక్కిస్తా



ఎస్సెస్సీలో 580 మార్కులు వచ్చిన వారందరికీ సొంతంగా రూ.5వేల చొప్పున నగదు ప్రోత్సాహకం అందిస్తానని గతేడాది విద్యార్థులకు మాటిచ్చా. ఈ ఆగస్టు 15కి అందజేస్తా. అలాగే ఈ ఏడాది ఎస్సెస్సీ చదువుతున్న విద్యార్థుల్లో నుంచి 580 మార్కులు సాధించిన విద్యార్థులను విమానం ఎక్కిస్తానని మాటిచ్చా. ప్రభుత్వ పాఠశాలలంటే నమ్మకం పెరిగేలా చదువులు చెబుతున్నాం. ఉపాధ్యాయులు, గ్రామస్తుల సహకారంతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించగలుగుతున్నాం. విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసేందుకు కింద తరగతుల నుంచే వారిని అన్ని విధాలుగా సన్నద్ధం చేస్తున్నాం.

– సురేశ్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు



సైన్స్ ల్యాబ్‌లో ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థినులు

కూతురిని ఇదే పాఠశాలలో చేర్పించి..



ఫొటోలో కనిపిస్తోంది ఉపాధ్యాయుడు సాయికుమార్. పక్కన ఉన్నది ఆయన కూతురు సాయి స్నిగ్ధ. సాయికుమార్ ఇదే పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. ప్రయివేటు పాఠశాలలో బోధన బాగోలేదని కారణంతో కూతురిని ఆ పాఠశాల నుంచి తీసేసి తాను పాఠాలు చెబుతున్న డొంకేశ్వర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేర్పించాడు. దీంతో ఉపాధ్యాయుడిని పలువురు అభినందిస్తున్నారు. సాయిస్నిగ్ధ ప్రస్తుతం పదో తరగతి చదువుతుండగా.. ప్రయివేటు కన్నా ఇక్కడే బాగుందని చెబుతోంది.

ఇక్కడే చదివి టీచర్ కొలువు సాధించా



నా స్వగ్రామం ఇదే. 1985 వరకు ఇక్కడే చదువుకున్నా. ఇప్పుడు ఇ క్కడే ఉపాధ్యాయుడిగా పని చేస్తు న్నా. డొంకేశ్వర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలు బాగుంటాయి. ఎలాంటి విద్యార్థులనైనా చదువులో రాణించేలా ఇక్కడి ఉపాధ్యాయులు తీర్చి దిద్దుతారు. మేము చదువుకున్న కాలంలో కన్నా ఇప్పుడు మరింత సౌకర్యాలున్నాయి. కొన్నేళ్లుగా పదో తరగతిలో సాధిస్తున్న ఫలితాలను చూస్తుంటే ఎంతో సంతోషంగా అనిపిస్తోంది.

– సాయికుమార్, ఉపాధ్యాయుడు

అర్థమయ్యేలా చెబుతారు



నేను ఇక్కడ ఆరో తరగతిలో చేరాను. పాఠశాల వాతావరణం చాలా బాగుంటుంది. ప్రయివేటులో కన్నా బాగా చదువు చెబుతారు. అనుభవం కలిగిన టీచర్లు ఉన్నారు. పాఠాలు అర్థం కాకుంటే మళ్లీ అర్థమయ్యే రీతిలో చెబుతారు. డిజిటల్ క్లాసులతోపాటు సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌ల ద్వారా చదువు మరింత చక్కగా నేర్చుకుంటున్నాం.

– సుంకరి సహస్ర, టెన్త్ విద్యార్థిని, డొంకేశ్వర్

క్లుప్తంగా

నేడు నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ నగరంలో ఊర పండగ నేపథ్యంలో ఆదివారం ట్రాఫిక్ డైవర్షన్ ఉంటుందని ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బోధన్ వైపు నుంచి వచ్చే, అటు వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు బోధన్ బస్టాండ్, నెహ్రూ పార్క్, గాంధీచౌక్ నుంచి బస్టాండ్ వైపుగా ఆదివారం మధ్యాహ్నం 3 గంటల వరకు రాకపోకలు సాగించాలని సూచించారు. నగర ప్రజలు సహకరించాలని ఏసీపీ కోరారు.

ఎస్సారెస్పీలోకి తగ్గిన ఇన్‌ఫ్లో

బాల్కొండ: స్థానిక ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి 2,998 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 100, ఆవిరి రూపంలో 359, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా శనివారం సాయంత్రానికి 1068.40(20.82 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

14న పీఎం నేషనల్ అప్రెంటీస్ మేళా

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 14న ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటీస్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం కోటిరెడ్డి తెలిపారు. ఈ మేళాలో పలు కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపిక చేసుకుంటారని పేర్కొన్నారు. ఐటీఐ పాసైన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు 9491566890, 8106794500 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

14, 15 తేదీల్లో డీసెట్ సర్టిఫికెట్ల పరిశీలన

నిజామాబాద్‌అర్బన్: డీఈఈసెట్‌లో ఉత్తీర్ణులై, గతంలో సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకాని వారికి ఈ నెల 14, 15 తేదీల్లో ధ్రువపత్రాల పరిశీలన చేపడుతున్నట్లు డైట్ కళాశాల ప్రిన్సిపల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో డైట్ కళాశాలలో హాజరుకావాలన్నారు. గతంలో సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయి, సీటు పొందని వారు ఈ నెల 16న వెబ్‌ఆప్షన్లు ఇవ్వాలన్నారు. రిజర్వేషన్, మెరిట్ ప్రకారం ఈ నెల 19న అలాట్‌మెంట్ జరుగుతుందని, సీటు వచ్చినవారు ఈ నెల 23న కళాశాలలో చేరాలని తెలిపారు.

ఐఐటీ మద్రాస్ ఆన్‌లైన్ కోర్సులకు కోనాపూర్ పాఠశాల

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రతిష్టాత్మక ఐఐటీ మద్రాస్ కోడ్ కనెక్ట్ ప్రోగ్రాం ఆన్‌లైన్ కోర్సులకు ఎంపికైనట్లు హెచ్‌ఎం చౌదారపు రామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ ప్రోగ్రాం ద్వారా డేటాసైన్స్, ఏఐ, ఎలక్ట్రానిక్ సిస్టమ్స్, ఆర్కిటెక్చరల్ డిజైన్, బయోలాజికల్ సిస్టమ్స్, ఫన్ విత్ మ్యాథమెటిక్స్ అండ్ కంప్యూటర్స్, మ్యాథ్స్ పజిల్స్, ఏరో స్పేస్ ఫండమెంటల్స్, ఇంట్రడక్షన్ టు లా, పర్యావరణ విద్య తదితర కోర్సులను నామమాత్రపు రుసుము రూ. 500లకే అందిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు కోర్సు కాలపరిమితి ఉంటుందని, కోర్సు పూర్తి చేసే విద్యార్థులకు ఐఐటీ మద్రాస్ సర్టిఫికెట్ జారీ చేస్తారని పేర్కొన్నారు.





వర్షంలో డ్రైవింగ్ జాగ్రత్త!

- జిల్లాలో ఏటా వర్షాకాలంలో 10 నుంచి 15 మంది మృత్యువాత
- వాహనాల వేగం తగ్గిస్తేనే ప్రమాదాల నివారణ



ఖలీల్‌వాడి: వర్షాకాలంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా అవుతుంటాయి. వర్షంకు వాహనాలపై వెళ్లేటప్పుడు స్కిడ్ అయి పడిపోయి మృతి చెందిన ఘటనలు జిల్లాలో ఉన్నాయి. బస్సులు, కార్లు, ద్విచక్రవాహనాలపై వెళ్లేటప్పుడు వాహనాదారులు జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు నివారించడానికి అవకాశం ఉంటుంది. వర్షాకాలంలో వర్షం కురిసే సమయంలో అతివేగంగా వెళ్లడంతో జిల్లాలో ప్రతి యేటా పదుల సంఖ్యలో వాహనదారులు మృతి చెందుతున్నట్లు పోలీసు వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ రోడ్డు ప్రమాదాల్లో భారీ వాహనాలు, కార్లు, ద్విచక్రవాహనాలపై వెళ్లే వారు ప్రమాదాలకు గురై, మృతి చెందుతున్నారు. ఎక్కువగా ద్విచక్ర వాహనాదారులే వర్షాకాలంలో ప్రమాదాలకు గురై, మృత్యువాత పడిన ఘటనలు ఉన్నాయి. వర్షంలో తొందరగా గమ్యస్థానాలకు వెళ్లడానికి స్పీడ్‌గా వెళ్లిన ద్విచక్ర వాహనదారులు వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. దీంతోపాటు రోడ్డుపై గాని బురదలో గాని బండ్లు స్కిడ్ కావడంతో పడిపోయి ప్రమాదానికి గురవుతున్నారు. రోడ్లపై ఉన్న గుంతల్లో నీరు నిలిచిఉండగా అందులోనుంచి వెళ్లకపోవడమే మంచిది.

ప్రయాణంలో ఇవి పాటించాలి..

- దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు వాహనానికి కావాల్సిన పెట్రోల్ ఎంత అవసరం అవుతుందో అంతమేర ముందుగానే పోసుకోవాలి. దీనితోపాటు టైర్లలో గాలిని చెక్ చేసుకోవాలి. వాహనంను బట్టి 30 నుంచి 35 పీఎస్సై వరకు గాలి చూసుకోవాలి.
- ప్రతి వాహనం 150 నుంచి 200 కిలోమీటర్ల వెళ్లిన తర్వాత వాహనాలను 5 నిమిషాల పాటు ఆపాల్సి ఉంటుంది. దీంతో డ్రైవర్లు కొంత సేదతీరుతుంటారు.
- వర్షంలో వాహనంతో స్పీడ్‌గా వెళ్తే ప్రమాదాలు జరుగుతాయి. వర్షాలకు వాహనాలు స్కిడ్ కావడంతోపాటు డ్రైవర్ చేతిలో నుంచి కంట్రోల్ తప్పుతాయి.
- వర్షకాలంలో ఆర్టీసీ బస్సులు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో వెళ్లాలి. అలాగే కార్లు, ఇతర వాహనాలు 80 కిలో మీటర్ల కంటే ఎక్కువగా వెళ్లరాదు. ద్విచక్రవాహనదారులు 40 కిలోమీటర్ల వేగం కంటే ఎక్కువగా వెళ్లరాదు.
- నాలుగు టైర్ల వాహనాదారులు ముందు ఉండే గ్లాస్‌తోపాటు వైపర్లు మంచిగా ఉంచుకునేలా చూడాలి.
- వాహనాల అద్దాలు బాగుంటేనే వర్షంలో వెళ్లేటప్పుడు ముందు కనిపించే వాహనాలు, రోడ్డు చూడటానికి అవకాశం ఉంటుంది.
- అలాగే వాహనం వెనుక, పక్కన వచ్చే వాహనాలను చూడటానికి సైడ్ మిర్రర్స్ బాగుండాలి. దీంతోపాటు డ్రైవర్ తోపాటు అందులో ప్రయాణించేవారు తప్పనిసరిగా సీట్‌బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలి.
- నాలుగు టైర్ల వాహనాలకు తప్పనిసరిగా వీల్ అలైట్‌మెంట్, బ్యాలెన్సింగ్ అనేది చూసుకోవాలి. ఇంజిన్‌ఆయిల్, కూలెంట్, బ్రేక్ ఆయిల్ ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలి.

స్పీడ్‌గా నడపొద్దు..

వర్షాకాలంలో వాహనాదారులు స్పీడ్‌గా వెళ్లవద్దు. వర్షం పడినప్పుడు రోడ్లపై ఉన్న గుంతల్లో నీరు నిలిచి ప్రమాదాలు జరుగుతాయి. అక్కడ జాగ్రత్త వహించాలి. వాహనాలపై వెళ్లేవారు తమ వాహనాల కండిషన్‌ను చూసుకోవాలి. కార్లు, ఇతర వాహనాదారులు సీట్‌బెల్ట్‌తోతోపాటు బ్రేక్‌లు, వైపర్లు, ముందు గ్లాస్, సైడ్ మిర్రర్లు, లైట్లు మంచిగా ఉంచుకోవాలి.

– ప్రసాద్, ట్రాఫిక్ సీఐ, నిజామాబాద్

ఆర్మూర్‌లో అంతర్భాగమైన రాజస్థానీలు

మీకు తెలుసా?

ఆర్మూర్ పట్టణంలో అత్యధిక జనాభా గల ఖత్రి (క్షత్రియ సమాజ్) కులస్తుల ప్రస్థానం ఆసక్తికరంగా ఉంటుంది. గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల సరిహద్దుల్లో గల మండవ్‌ఘడ్ ఖత్రిల పుట్టినిల్లు.



సహస్రార్జుని ప్రతిరూపం

- పట్టు చేనేత వస్త్రాలను నేస్తూ గుజరాత్, రాజస్థాన్‌లలో సరఫరా చేసేవారు. అప్పట్లో పట్టు వస్త్రాలకు ఉన్న డిమాండ్ మేరకు ఖత్రిలు ఉపాధి కోసం 500 సంవత్సరాల క్రితం ఉత్తరప్రదేశ్, పంజాబ్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాలకు వెళ్లారు.
- ఖత్రిలు మాట్లాడే భాషకు లిపి లేదు.
- పట్టు వస్త్రాల నేత పనే జీవనాధారంగా కొనసాగించిన ఖత్రి కులస్తులకు ఉపాధి కరువవడంతో ఇతర వ్యాపారాల్లో స్థిరపడ్డారు.



మధ్యప్రదేశ్‌లోని మహేశ్వరంలో సహస్రార్జునుడు నిర్మించిన కోట వద్ద ఖత్రిలు

- 64 వేల ఆర్మూర్ పట్టణ జనాభాలో 16 వేలకు పైచిలుకు ఖత్రి కులస్థులు ఉన్నారు.
- ఓటర్లు సైతం 10 వేలకు పైగా ఉండటంతో పరిపాలన, రాజకీయ రంగాల్లో సైతం వారికి ప్రత్యేక స్థానం ఉంది. పట్టు నేత ప్రధాన కులవృత్తిగా ఉన్న ఈ ఖత్రి కులస్థులను క్షత్రియులుగా కూడా సంబోధిస్తారు.
- పట్టు నేయడంతో పట్కరీలు అనే మరో పేరు సైతం వీరికి వచ్చింది.
- వీరు శివుడి భక్తుడైన సహస్రార్జునుని పూజిస్తారు. ఆయన వంశీకులుగా దేశంలోని అన్ని ప్రాంతాల్లో విస్తరించారు. – ఆర్మూర్

మైలు రాళ్లకు రంగులు వేటికి గుర్తులో తెలుసా?

సమాచారం..



ఖలీల్‌వాడి : మనం ప్రయాణించే సమయంలో రోడ్డు పక్కన మైలు రాళ్లు కనిపిస్తుంటాయి. అన్నింటికీ ఒకే రంగు కాకుండా వివిధ రకాల రంగులను చూస్తాం. రోడ్లను బాధ్యతలు చూసే శాఖలను ఈ రంగులు సూచిస్తాయి. పసుపు, తెలుపు రంగులో ఉంటే జాతీయ రహదారి(ఎన్‌హెచ్), ఆకుపచ్చ, తెలుపు వర్ణంలో ఉంటే స్టేట్ (రాష్ట్ర) రహదారి, నలుపు, తెలుపులో ఉంటే నగర, జిల్లా రహదారి, కాషాయం, తెలుపు రంగు ఉంటే గ్రామీణ రోడ్లుగా గుర్తించాలి. రెండు గ్రామాలను కలుపుతూ ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన ద్వారా వేసే రోడ్లకు కూడా కాషాయం, తెలుపు రంగు వేస్తారు.



53 ఏళ్ల తర్వాత ఒకే వేదికపైకి..



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

- 'మానిక్‌భవన్'లో పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవాలు
- హాజరైన పూర్వ విద్యార్థి, ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్: జిల్లా కేంద్రంలోని మానిక్ భవన్ పాఠశాలలో 1972–73వ సంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. 53 ఏళ్ల తర్వాత విద్యార్థులంతా ఒకే వేదికపైకి రావడంతో ఒకరినొకరు ఆప్యాయంగా ఆలింగనం చేసుకొని, పరిచయ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆ బ్యాచ్ పూర్వ విద్యార్థిగా నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులు సుబ్బారావు, కృష్ణారావును ఘనంగా సన్మానించారు. విద్యార్థి సమయంలో చేసిన అల్లరి పనులు, తీపి జ్ఞాపకాలను వేదికపై స్నేహితులతో పంచుకున్నారు. రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు.

స్నేహం విలువైన ఆస్తి : ఎమ్మెల్యే ధన్‌పాల్

50 ఏళ్ల నుంచి నేటివరకు సాగిన తమ స్నేహం ఒక విలువైన ఆస్తిగా భావిస్తున్నానని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ పేర్కొన్నారు. వివిధ రంగాల్లో ఉన్నతస్థానాల్లో ఉన్నామంటే మానిక్‌భవన్ పాఠశాల గురువులే కారణమన్నారు. తన విజయపథానికి పాఠశాల తొలి అడుగు అయ్యిందని తెలిపారు. గురువుల ఆశీర్వాదం, పాఠశాల మార్గదర్శకతతో తాను వ్యాపారవేత్తగా, ఎమ్మెల్యేగా ఎదిగానన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చంద్రశేఖర్, గోపాల్ రెడ్డి, గౌతమ్, మోహన్ పట్లోళ్ల, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరద మొరంపై వీడీసీల పెత్తనం!

- సర్కారు అనుమతులు లేకున్నా యథేచ్ఛగా తరలింపు
- తవ్వకాలపై నిత్యం రూ.8వేల నుంచి రూ.10వేల వరకు వసూళ్లు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వరద కాలువ తవ్వకాల్లో వెళ్లిన మొరంపై కాలువ శివారు గ్రామాలకు చెందిన కొన్ని వీడీసీల పెత్తనం జోరుగా సాగుతుంది. ప్రాజెక్ట్ అధికారుల అనుమతి లేకున్నా సరే.. కానీ ఆ గ్రామాల వీడీసీల అనుమతులు తప్పనిసరిగా ఉండాలి. వరద కాలువ శివారు గ్రామ వీడీసీలకు ఈ మొరం ఓ ఆదాయ వనరుగా మారింది. డబ్బులు ఇస్తే చాలు, అనుమతులు లేకున్నా మొరం తరలించుకోవచ్చు అన్నట్లుగా మారింది.

ఇదీ పరిస్థితి..

వరద కాలువ నిర్మాణంలో భూములు కోల్పోయామంటూ మొరం తవ్వకాలపై వీడీసీలు పెత్తనం చెలాయిస్తున్నారు. దీంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. మొరం తవ్వకాలు చేపట్టడానికి క్యూబిక్ మీటర్‌కు రూ. 136 చెల్లించి అధికారుల అనుమతి తీసుకోవాలి. అలానే అధికారుల పర్యవేక్షణలో మొరం తరలించాలి. కానీ వరద కాలువ వెంబడి ఉన్న గ్రామాల్లో మొరం తరలించినప్పుడు వ్యాపారులు రోజుకు రూ.8వేల నుంచి రూ.10వేలు వీడీసీలకు చెల్లించాలి. టిప్పర్ల ద్వారా మొరం తరలిస్తే సర్కార్‌కు రోజుకు రూ. 24వేలు, ట్రాక్టర్‌లతో తరలిస్తే రోజుకు రూ.12 వేలు చలాన్ రూపంలో సర్కార్‌కు చెల్లించాలి. ఇలా సర్కార్‌కు, వీడీసీలకు చెల్లింపు చేపట్టడంతో మొరం ధర ఎక్కువవుతోంది. వ్యాపారులు టిప్పర్ మొరంను వినియోగదారులకు రూ.3 వేలకు అందిస్తున్నారు. దీంతో చివరికి వారి భారమంత వినియోగదారులపైనే పడుతుంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్ శివారు గ్రామాల్లో పరిస్థితి ఇలానే ఉంది. మట్టి, మొరం దందాలపై వీసీడీల పెత్తనం ఇలా సాగుతున్నా అధికారులు మాత్రం తమకేమీ పట్టదన్నట్లుగా ఉంటున్నారు. అధికారులు స్పందించి వీడీసీలపై తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



వరద కాలువ నుంచి తరలిస్తున్న మొరం

ఏం చేయలేకపోతున్నాం..

వరద కాలువ నుంచి మొరం తవ్వకాలకు అనుమతులు లేకున్నా వీడీసీలు తరలించుకుంటున్నారు. వీడీసీలపై ఏమీ చేయలేకపోతున్నాం. నిబంధనలు చెబితే బెదిరింపులే వస్తున్నాయి. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

–రామారావు, ఏఈఈ, వరద కాలువ, ఎస్సారెస్పీ

ఆర్టీసీ బస్సు ఢీ.. వృద్ధుడికి తీవ్రగాయాలు



డిచ్‌పల్లి: రోడ్డుపై వెళుతున్న వృద్ధుడిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలైన ఘటన డిచ్‌పల్లి మండల కేంద్రంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ రెండో డిపోకు చెందిన ఎలక్ట్రిక్ బస్సు (టీజీ 16టీ 2419) డిచ్‌పల్లి బస్టాండ్‌లో ప్రయాణిలను ఎక్కించుకొని నిజామాబాద్ వెళ్లే ప్రధాన రహదారిపైకి వస్తుండగా రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న డిచ్‌పల్లి ఖిల్లా గ్రామానికి చెందిన మాల గొల్ల కృష్ణయ్యను ఢీకొట్టింది. బస్సు ముందు టైరు కిందపడిన కృష్ణయ్య తీవ్రంగా గాయపడ్డాడు. 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పరిశీలించిన వైద్యులు పాదం వరకు కాలును తొలగించాల్సిన అవసరం ఉందని, హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తీసుకెళ్లాలని సూచించినట్లు కృష్ణయ్య కుటుంబీకులు తెలిపారు. డ్రైవర్ అజాగ్రత్తతోనే ప్రమాదం జరిగినట్లు స్థానికులు పేర్కొన్నారు. ఈ విషయమై డిచ్‌పల్లి ఎస్సైను సంప్రదించగా ప్రమాదం జరిగిన మాట వాస్తవమేనని, ఇంకా ఫిర్యాదు అందలేదన్నారు.

పెద్దపులి జాడ కోసం గాలింపు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

సిరికొండ: పెద్దపులి జాడ కోసం అటవీశాఖ అధికారు లు గాలింపు ముమ్మరం చే శారు. పాదముద్రలు లభ్యమైన చెరువుల పైభాగాన గల జినిగ్యాల అటవీ ప్రాంతంలో యానిమల్ ట్రాకర్స్ బృందం సభ్యులు, సిరికొండ రేంజ్ సిబ్బంది శనివారం గాలించినట్లు ఎఫ్‌ఆర్‌వో రవీందర్ తెలిపారు. మరెక్కడా పెద్దపులి అడుగులు కనిపించలేదని పేర్కొన్నారు. అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న చీమన్‌పల్లి, పందిమడుగు, తెల్లపలుగు తండా, జినిగ్యాల తండాలలో అధికారులు అవగాహన కల్పించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డీఆర్వో గంగారం, పందిమడుగు సెక్షన్ అధికారి సాయికిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో ఒకరి అరెస్టు

ధర్పల్లి: మండలంలోని హోన్నాజీపేట్ గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన చోరీ కేసులో దొంగను పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై కళ్యాణి తెలిపారు. హోన్నాజీపేట్ వీర హనుమాన్ ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు హుండీ ధ్వంసం చేసి నగదును ఎత్తుకెళ్లారు. మరో కిరాణా దుకాణం తాళాలు పగులగొట్టి చోరీకి యత్నించినట్లు బాధితులు శనివారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్సై కళ్యాణి దర్యాప్తులో భాగంగా ప్రత్యేక బృందంతో గాలింపు చేపట్టి నిందితుడు గోత్రాల నాగరాజు ధర్పల్లి బస్టాండ్‌లో పట్టుకున్నారు. నిందితుడి నుంచి రూ.2,106 నగదును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. 24 గంటలలోపే కేసును ఛేదించిన ఎస్సై కళ్యాణితోపాటు సిబ్బందిని సీఐ భిక్షపతి అభినందించారు.

ప్రమాదవశాత్తు సివిల్ ఇంజినీర్ మృతి

- మృతుడు బాపట్ల వాసి



గణేశ్(ఫైల్)

నవీపేట: మండలంలోని కోస్లీ గ్రామ సమీపంలోని చెరువులో పడి ప్రైవేట్ సివిల్ ఇంజినీర్ గుత్తి ఉమా గణేశ్(30) మృతి చెందినట్లు ఎస్సై వినయ్ శనివారం తెలిపారు. ఆయన కథనం మేరకు .. ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గం వేటపాలెం మండల కేంద్రానికి చెందిన ఉమా గణేశ్ భైంసా నుంచి బోధన్ వరకు జరుగుతున్న జాతీయ రహదారి నిర్మాణ పనులలో సివిల్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అనూష ప్రాజెక్ట్‌లో కొన్నేళ్లుగా విధులు నిర్వహిస్తున్న గణేశ్, నిర్మల్ జిల్లా బాసరలోని కార్యాలయంలో ఉంటూ విధులకు వెళ్లేవాడు. కోస్లీ శివారులో మొరం తవ్వకాలు జరగడంతో పర్యవేక్షణకు శుక్రవారం సాయంత్రం బైక్‌పై వెళ్లి తిరిగి రాలేదు. శనివారం సాయంత్రం మృతదేహాన్ని గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించామన్నారు. మృతుని తండ్రి మల్లేశ్వర్‌రావ్‌కు సమాచారం అందించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్ తెలిపారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో రైతు మృతి



హన్మాండ్లు(ఫైల్)

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని ముదెల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో పోకల హన్మాండ్లు(45) అనే రైతు శనివారం మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపా రు. హన్మాండ్లు కౌలు చేస్తున్న పొలంలోని బోరుమో టారు స్టార్టర్‌లో సమస్య రావడంతో మరమ్మతులకు య త్నించగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య శకుంతల ఫిర్యాదు మేరకు ఏఎస్సై నర్సయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు



గాయపడ్డ చిన్నారి

రుద్రూర్ : ఆరుబయట ఆడుకుంటున్న మూడేళ్ల చిన్నారిపై కుక్కలు దాడి చేసి గాయపర్చిన ఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మహతాజ్ అనే చిన్నారి ఆరు బయట ఆడుకుంటుండగా కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. గాయపడిన మహతాజ్‌ను కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మలుపు తిరుగుతున్న రూ.400 కేసు

- ఆటో డ్రైవర్‌ను బెదిరించిన రౌడీషీటర్ గ్యాంగ్
- బృందంలో మాజీ కార్పొరేటర్ కుమారుడు!

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పరిధిలో ఆటో డ్రైవర్‌ను బెదిరించి రూ.400 ఎత్తుకెళ్లిన కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. బాధితుడు రౌడీషీటర్ బర్కాత్ ఆమీర్‌పై ఫిర్యాదు చేయడంతో కేసును సీపీ సాయిచైతన్య సీసీఎస్ పోలీసులకు అప్పగించారు. దీంతో రంగంలోకి దిగిన సీసీఎస్ పోలీసులు పక్కా ఆధారాలతో రౌడీషీటర్ గ్యాంగ్ సభ్యులపై చర్యలకు ఉపక్రమించారు. ఈ కేసులో 15 మందిపై ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టి సీసీఎస్ పోలీసులు నలుగురిని రిమాండ్‌కు తరలించారు. నాలుగు రోజుల క్రితం మరో ముగ్గురు సభ్యులను అరెస్ట్ చేసి రిమాండ్ చేయగా మరో ఎనిమిది మంది పరారీలో ఉన్నారు. కాగా, ఈ గ్యాంగ్‌లో ప్రముఖుల కుమారులు ఉన్నట్లు తెలుస్తోంది. ఓ మాజీ కార్పొరేటర్, అధికార పార్టీకి చెందిన నేత కుమారుడు ఈ కేసులో ఉన్నట్లు తెలిసింది. దీంతో కేసు నుంచి తన కుమారుడిని తప్పించేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. కానీ, కేసులో బలమైన ఆధారాలు పోలీసుల చేతిలో ఉండటంతో ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు ఈ కేసులో తన కొడుకు అరెస్టు కాకుండా హైకోర్టులో ముందస్తు బెయిల్ తెచ్చుకున్నట్లు తెలిసింది. కాగా, మాజీ కార్పొరేటర్ కుమారుడిపై ఇప్పటికే మూడు కేసులు ఉన్నట్లు సమాచారం.

పోలీసుల అదుపులో ప్రధాన నిందితుడు?

ఈ కేసులో పోలీసులు ఏడుగురిని అరెస్ట్ చేయగా అందులో ఒకరి వద్ద గంజాయి లభించడంతో ఎన్‌డీపీఎస్ కింద కేసు నమోదు చేసినట్లు సమాచారం. దాడి సమయంలో గ్యాంగ్ సభ్యులు గంజాయి మత్తులో తెలిసింది. కాగా, ప్రధాన నిందితుడు, రౌడీషీటర్ బర్కాత్ అమీర్ పరారీలో ఉండగా, రెండు రోజుల క్రితం సీసీఎస్ పోలీసులు హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.